సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

- యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలి
- శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కో ఆప్షన్ సభ్యుడు గఫార్ స్వగృహంలో టీడీపీ నాయకుడు మసాల మహమ్మద్ ఆధ్వర్యంలో 2, 25 వార్డులకు చెందిన మాసుం, హనీఫ్, శాలుమియ్య, కటిక జమ్మ, కటిక నాబూజీ, చికెన్ నూర్, గోకారి, చాకలి వెంకటేశ్వర్లు, చికెన్ రాజు, ఉస్మాన్, మసాల అల్లిబాషా, చాంద్‌బాషా, యూనూష్, కటిక మౌలాలి, కటిక బాబు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్ధార్థరెడ్డి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలో సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాటపై నలబడే వ్యక్తి కాదన్నారు. సీఎం వైఎస్ జగనన్న పేదలకు చేస్తున్న మంచే ఆయనను గెలిపిస్తుందన్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని, సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు రవూఫ్, లాలు, చిన్నరాజు, సురేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉస్మాన్ బేగ్, అబుబక్కర్, లాయర్ నజీర్, కుర్వ శ్రీను, రమేష్, కోకిల రమణారెడ్డి, శివప్రసాద్, లడ్డూ, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలి కార్మికుల సంక్షేమానికి కృషి

మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడి చెప్పారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో సిద్ధార్థరెడ్డికి మున్సిపల్ కార్మికులు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి కార్మికులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. కార్మిక సంఘం నాయకులు భాస్కర్, భాగ్యలక్ష్మి, నాగన్న, దిలీప్, శేషన్న, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాములపాడు: కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న మండల కేంద్రానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లె బుచ్చిరెడ్డిని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండండి అన్నా ఏమి కాదని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మండలంలోని మద్దూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రాముడు తండ్రి గొల్ల పుల్లయ్య(83) క్రిష్ణానగర్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లయ్య తల్లి అల్లూరమ్మ (80)ల మృతదేహాలపై బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బుధవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి, సొసైటీ చైర్మన్ క్రిష్ణారెడ్డి, మిట్టకందాల సర్పంచు చింతల నారాయణ, నాయకులు ఎల్వీ రమణారెడ్డి, మహానందిరెడ్డి, బాలీశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉశేన్ తదితరులు ఉన్నారు.

మచ్చలను నిర్లక్ష్యం చేయొద్దు

మహానంది: చర్మంపై వచ్చే మచ్చలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన వైద్యచికిత్సలు తీసుకోవాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాంతి ప్రియ తెలిపారు. మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాగి రంగులో మచ్చలు కనిపిస్తే తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంబమ్మ, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి

కొత్తపల్లి: మండలంలో రైతులు ఉద్యాన పంటల సాగు చేసుకునేలా హార్టికల్చర్ సిబ్బంది దృష్టి సారించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కేవలం 100 ఎకరాలలోపు మాత్రమే రైతులు హార్టీకల్చర్ పంటలను సాగుచేస్తున్నారని, ఇంకా ఎక్కువమంది రైతులు హార్టీకల్చర్ పంటలను సాగుచేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం దుద్యాల గ్రామ శివారుల్లో రైతులు హార్టీకల్చర్ కింద సాగు చేసుకుంటున్న జామతోటలను పరిశీలించారు.

క్లుప్తంగా

వేలం పాటకు ముందుకు రావాలి

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతీదేవి ఆలయ ఆవరణలో అంగళ్ల నిర్వహణకు జరిగే బహిరంగ వేలంపాటలో పాల్గొనేందుకు పాటదారులు ముందుకు రావాలని ఈఓ మోహన్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 11 ఈ వేలం పాట నిర్వహిస్తామన్నారు. హోటల్ పెట్టుకొనుటకు, బెల్లం చెరుకులు, కలింగర పండ్లు, అమ్మవారి ఫొటోలు అమ్ముకొనుటకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పకే ఈ అంగళ్ల నిర్వహణ కోసం రెండుసార్లు వేలంపాట నిర్వహించగా పాటాదారులు ముందుకు రాకపోవడం వాయిదా పడిందని తెలిపారు.

89.11 శాతం కులగణన పూర్తి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే 89.11 శాతం పూర్తయ్యిందని సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 161 క్లస్టర్లు ఉన్నాయి. ఇందులో 10,606 కుటుంబాలకు గాను 30,501 జనాభా ఉన్నట్లు చెప్పారు. కులగణన సర్వేలో భాగంగా 9,451 కుటుంబాల వద్దకు వెళ్లి 25,251 మంది వివరాలను కులాల వారీగా గ్రామవలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ సర్వే నిర్వహించారని తెలిపారు. దీంతో మండలంలో 89.11 శాతం సర్వే పూర్తిఅయిందని, మిగతా సర్వే త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

నేడు వేలం పాటలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో గురువారం వివిధ అంశాలకు వేలాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. నవగ్రహాల వద్ద దీపారాధన సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, వాహనాల పూజలు చేసుకునేందుకు వేలాలు ఉంటాయన్నారు. వీటితో పాటు మొత్తం 14 అంశాలకు వేలాలు ఉన్నాయన్నారు. బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో గురువారం బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎ.విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ తెలిపారు. కొబ్బరికాయల విక్రయం, కూల్‌డ్రింక్ షాపుల నిర్వహణ, ఐస్‌క్రీం బండ్లు పెట్టుకోవడానికి టెండర్లు ఉంటాయన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

మిడుతూరు: దశమందం విద్యాసేవా సదన్ (వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో హిందీ భాష ప్రచార భాగంలో రాష్ట్ర స్థాయిలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు హిందీ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచడంతో ఎస్ఓ విజయలక్ష్మి బుధవారం అభినందించారు. ఎస్ఓ మాట్లాడుతూ హిందీ పరీక్షలో ఎనిమిదవ తరగతి విద్యార్థినులు మధుమిత్ర, శృతి, తొమ్మిదో తరగతి కీర్తన, హర్షియా, పదో తరగతి చదువుతున్న తేజస్విని ఉత్తమ ప్రతిభ కనపరచినట్లు తెలిపారు.

బాలలతో పని చేయిస్తే శిక్ష


మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: బాల కార్మికులతో పనులు చేయిస్తే కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి కుటుంబానికి అప్పగించడం జరుగుతుందన్నారు. బడి బయట ఉండే పిల్లలను బడిలో, చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించాలని ఎస్ఐ, సీడీపీఓకు ఆదేశించారు. అలాగే మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్, క్రిమినల్, కంపౌండబుల్ ఎక్సైజ్, మున్సిపాలిటీ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

నిస్వార్థ సేవతోనే గుర్తింపు


తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: అధికారులు నిస్వార్థంతో ప్రజలకు సేవచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని నందికొట్కూరు తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, జూపాడుబంగ్లా ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ నాగన్న అన్నారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌కు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరంగారెడ్డి, మండల సర్వేయర్ షహనా పర్వీన్, వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ బదిలీ

పగిడ్యాల: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరమణ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజరావు నియమితులయ్యారు. అలాగే తహసీల్దార్ భారతి కూడా అనంతపురం జిల్లాకు బదిలీ అయినట్లు డిప్యూటీ తహసీల్దార్ రవి తెలిపారు.

బండిఆత్మకూరు తహసీల్దార్

మహానంది: సాధారణ బదిలీలలో భాగంగా బండిఆత్మకూరు మండల తహసీల్దార్ ఎస్.రవికుమార్ వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని మున్సిపల్ చైర్‌సర్సన్ ఆసియా మారుఫ్ అన్నారు. బుధవారం పట్టణంలోని జేసీ పాలెం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి ఇంటింటికి వైద్యులను పంపిస్తూ రోగులకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ప్రజల వద్దకే వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న కేవీఆర్ గార్డెన్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యురాలు షైనీ ప్రియాంక, డాక్టర్ శ్వేత, ఆరోగ్య సిబ్బంది 3, 5, 4, 6, వార్డులకు చెందిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

తీర్మానం మేరకే పనులు జరిగాయి


విచారణ చేస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

జూపాడుబంగ్లా: పోతులపాడు గ్రామంలో జరిగిన కాంపౌండు వాలు, పంపుసెట్ ఏర్పాటు వంటి పనులు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ తీర్మానాల మేరకే జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పోతులపాడు పంచాయతీపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, పోతులపాడు సర్పంచ్ నిర్మలమ్మ అధ్వర్యంలో విచారణ జరిగింది. విచారణలో వెల్లడైన విషయాలను కమిషనర్‌కు తెలియజేయనున్నట్లు తెలిపారు.

వాల్టా సర్టిఫికెట్ లేకుండా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

జూపాడుబంగ్లా: వాల్టాచట్టం సర్టిఫికేట్ లేకుండా వ్యవసాయ బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర మాట్లాడుతుండగా గ్రామాల్లోని చేతి పంపులను మరమ్మతులు నిర్వహించడం లేదని, ఎంపీపీ నిధులు వెచ్చించి మెకానిక్‌ను నియమించి రిపేరి చేయించాలని పలువురు సర్పంచులు కోరారు. ట్రాన్స్‌కో ఏఈ రామాచారి మాట్లాడుతూ గడప గడప కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన విద్యుత్ సమస్యలను పరిష్కరించామన్నారు. రైతులు వ్యవసాయ బోర్లకు విద్యుత్ కోసం చేసుకొన్న దరఖాస్తులను సీనియార్టీ ప్రకారంగా కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు, డీటీ నాగన్న, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలో వేసవిని దష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి నివారణకు ఇప్పటి నుంచే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నీటి ఎద్దడి లేకున్నా మార్చి నెల నుంచి నీటి ఎద్దడి ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని చెప్పారు. ప్రధానంగా చెంచు గూడేల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పెచ్చెర్వు చెంచు గూడెం, నాగలూటి చెంచుగూడెం వద్ద బోర్లకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం నాగమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వలస పోకుండా పనులు ప్రారంభించామని, అవసరమైతే మరిన్ని పనులు కల్పించి కూలీలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ట్రాన్స్‌కో ఏడీ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, సర్పంచులు, ఎంపీటీసీ, అధికారులు పాల్గొన్నారు.

ఒక కుటుంబం చేరితే 30 కుటుంబాలని ప్రచారం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో ఒక కుటుంబం టీడీపీలో చేరితే మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి 30కుటుంబాలు చేరినట్లు అన్ని పత్రికల్లో ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాగాల వెంకటరమణ అన్నారు. ఎంతమంది చేరారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడమల కాల్వ గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బుడ్డా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మా గ్రామాల్లోకి వచ్చి తన్నులు తింటారు అని మా కుటుంబాల గురించి మాట్లాడటం ఎంతవరకు సబబన్నారు. రాగాల కుటుంబాల వారు ఎలాంటి వారో అందరికీ తెలుసన్నారు. నాయకులు మాటలతో ప్రజలను ఆకట్టుకోవాలే తప్ప తన్ని వెల్లగొడతామని ఎంతవరకు సమంజసమేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

అలరించిన హరికథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన పి.బి.కమణమూర్తి హరిదాసు వారిచే నిర్వహించిన భూకైలాస్ పై హరికథ కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమానికి కీబోర్డు సహకారాన్ని వై.రమణ, తబల వై.రమణ అందించారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధతవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. నాణ్యతలేని మోటార్లు కొనుగోలు చేశారని 24వ వార్డు చాంద్‌బాషా డీఈ నాయబ్ రసూల్‌ను నిలదీశారు. గుత్తేదారుడు ఏడాది వారెంట్ ఉన్న నాలుగు మోటార్లు తెచ్చారని, వారెంట్ ఉంది కదా అని డీఈ ఓకే చెప్పడం హాస్యస్పదంగా ఉందని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. ఏదీ అడిగిన పొంతన లేని సమాధానాలు డీఈ చెప్పడం సరికాదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్మికులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సమావేశంలో కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, డీటీ సోమేశ్వరమ్మ, ఎంఈఓ ఫైజున్నీసాబేగం, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వెలుగోడు ఎస్ఐగా భూపాలుడు

వెలుగోడు: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా భూపాలుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన దేవనకొండ పోలీసు స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వెలుగోడులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట నాగప్రసాద్ అన్నమయ్య జిల్లా గాలివీడు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే వెలుగోడు ఏఎస్ఐగా ఎస్.హుస్సేన్, మరో ముగ్గురు కానిస్టేబుల్స్ బాధ్యతలు చేపట్టారు.

అడవుల పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ నాసిర్‌ఝా

మహానంది: అడవులు, వన్య ప్రాణులను కాపాడేందుకు ప్రజలు భాగస్వాములవ్వాలని బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా పిలుపునిచ్చారు. బండిఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామంలో బుధవారం రాత్రి అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో అడవుల రక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరైనా అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అడవుల్లోని వన్య ప్రాణులను వేటాడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణు, ఎంపీటీసీ వెంకటమ్మ, సిబ్బంది పీవీ సుబ్బయ్య, మదార్ సాహెబ్, ప్రసన్న, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం

వెలుగోడు: ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం నంద్యాల పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా భవనాశి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా బళ్లాని వెంకట సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శిగా తాళ్లూరి నాగరాజు, వెలుగోడు మండల అధ్యక్షుడిగా బచ్చు రాము, మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం చేయనున్నారని చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎంపీపీ సరోజినీ

పాములపాడు: మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ తొగురు సరోజినీ వర్జీనియ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కరుణసాగర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

మహానంది: మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ(ఎఫ్ఏసీ) హనీఫ్ ఖాన్ సూచించారు. బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త బదిలీ అయిన నేపథ్యంలో ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు.

ఉపాధి పనులపై సమీక్ష

బండిఆత్మకూరు మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హనీఫ్‌ఖాన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఓ వసుధారెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. హౌసింగ్ 90 పనిదినాలు, అవెన్యూ ప్లాంటేషన్, ఉద్యానశాఖ, తదితర పనుల పురోగతిపై సిబ్బందితో చర్చించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. పట్టణంలోని ధునుంజయ మీటింగ్‌హాలులో బుధవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 8న విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆశా కార్యకర్తలు శారద, లక్ష్మి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కరుణసాగర్

పాములపాడు: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణ సాగర్‌ను నియమిస్తూ బుధవారం కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ గోపీక్రిష్ణను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సునీత

నందికొట్కూరు: ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంతో సురక్షితమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యానికి క్షేమంగా చేర్చే బాధ్యత ఆర్టీసీ తీసుకుంటుందన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టౌన్ ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ క్షేమంగా ఇంటికి చేరాలంటే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలన్నారు. అనంతరం టౌన్ ఎస్ఐని డీఎం, కార్మికులు ఘనంగా సన్మానించారు.

ప్రయాణికులకు బహుమతులు ప్రధానం

కర్నూలు–నందికొట్కూరు మార్గంలో ప్రయాణించిన ప్రయాణికులకు బుధవారం బహుమతులు అందజేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల మధ్య ప్రజలు డిప్ తీశారు. మొదటి బహుమతి జంగ్లీ సాహెబ్, రెండోవ బహుమతి గార్గేయపురం వాసి పీతంబరరెడ్డి, మూడో బహుమతి యశ్వంత్ కుమార్‌లకు ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు ప్రదానం చేశారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు పరిశీలించారు. బుధవారం గంగాభవానీ స్నానఘట్టాలు, పలు పార్కింగ్ ప్రదేశాలు, పలు వసి సముదాయాలు పరిశీలించారు. గంగా భవానీ స్నానఘట్టాలు ఆలయానికి సమీపంలో ఉన్న కారణంగా అధిక సంఖ్యలో భక్తులు, శివ స్వాములు స్నానఘట్టాలకు వచ్చే అవకాశం ఉందని, అందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గంగాభవాని స్నానఘట్టాల వద్ద వీలైనన్నీ కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు స్నానఘట్టాలను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని సూచించారు. ఈఈ వి.రామకృష్ణ, ఏఈఈవో మోహన్, పర్యవేక్షకులు అయ్యన్న, శివప్రసాద్, ఏఈలు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే కలకాలం గుర్తుంటాయి


తహసీల్దార్ జనార్దన్‌శెట్టిని సన్మానిస్తున్న అతిథులు, వీఆర్ఓలు

మహానంది: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పని సరని, అయితే విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే కలకాలం గుర్తుండటంతో పాటు మంచి పేరు తీసుకొస్తాయని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మహానంది ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మహానంది తహసీల్దార్ జనార్దన్ శెట్టి పదవీ విరమణ సందర్భంగా శాలివాహన అన్నసత్రం వద్ద సన్మాన కార్యక్రమం చేపట్టారు. మహానంది దేవస్థానంలోని పడితరం ప్రసాదాల తయారీ విభాగంలో 42ఏళ్ల పాటు పనిచేసిన హెచ్.జుమన్ కుమార్ పదవీ విరమణ సందర్భంగా పోచా బ్రహ్మానంద రెడ్డి డార్మెటరీ భవనంలో సన్మానం చేశారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ గాజులపల్లె కిట్టు, డీటీ సత్యశ్రీనివాసులు, ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

నందికొట్కూరు రూరల్ : ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐ నాగార్జున హెచ్చరించారు. బుధవారం కోళ్లబావాపురం గ్రామం వద్ద నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.